

లబ్ధిదారులకు రేషన్ అందిస్తున్న వినోద్‌కుమార్ గౌడ్ తదితరులు

మోదీ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ 11 సంవత్సరాల పాలన పూర్తిచేసుకున్న నేపథ్యంలో బీజేపీ బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు వినోద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం కేపీహెచ్‌బీలో పౌర సరఫరాల కేంద్రాలను పరిశీలించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ సబ్ కా సాత్, సబ్ కా వికాస్ నినాదాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాకారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కరికీ ఐదు కిలోల చొప్పున మూడు నెలల రేషన్ ఒకేసారి ఇస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు రేషన్ ఇస్తున్నారా లేదా అని పరిశీలించామన్నారు. రేషన్ కేంద్ర ప్రభుత్వం ఇస్తుందా? రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందా అని ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ నాయకుడు రాఘురాం, భగవంత్ రెడ్డి, గోపీ, సూరిబాబు, శేఖర్, గణేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బడిబాట ప్రారంభం

- ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు
- అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా తల్లిదండ్రులకు అవగాహన

కూకట్‌పల్లి/హైదర్‌నగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు, ఉచిత పుస్తకాలు, యూనిఫామ్‌లు, సబ్జెక్టులవారీగా ఉపాధ్యాయుల వివరాలు, మధ్యాహ్న భోజనంతో పాటు ఆటలు వంటి వాటిపై విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో గతంతో పోలిస్తే మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, పదో తరగతిలో కూకట్‌పల్లి మండల పరిధిలో ఉన్న మూసాపేట బాలికల పాఠశాలలో 572 మార్కులు వచ్చాయని చెప్పారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, డ్రాప్‌అవుట్ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిని పాఠశాలల్లో చేర్పించడం, ఈ నెల 12న విద్యా కమిటీలు, ప్రజాప్రతినిధులతో కలిసి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ల పంపిణీ నిర్వహిస్తారు. 13న సామూహిక అక్షరాభ్యాసం, 17న బాలికాదినోత్సవం, 18న పాఠశాల డిజిటలీకరణపై అవగాహన, 19న బడిబాట ముగింపులో భాగంగా క్రీడా పోటీలు ఉంటాయి.



కూకట్‌పల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు

బబ్బుగూడలో..

కూకట్‌పల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని బాలానగర్ ఎంఈవో హరిచందర్ సూచించారు. శుక్రవారం బాలానగర్ మండల పరిధిలోని బబ్బుగూడ మండలపరిషత్ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొలిరోజే 17 అడ్మిషన్లు

విద్యాశాఖ ఆదేశాల మేరకు బడిబాట కార్యక్రమం ప్రారంభించాం. తొలిరోజు 17 మంది విద్యార్థులు అడ్మిషన్‌లు తీసుకున్నారు. ఉత్తమ ఫలితాల కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి.

- నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కూకట్‌పల్లి

అడ్మిషన్లు పెంచేలా కృషిచేస్తున్నాం

ప్రభుత్వ పాఠశాల్లో పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాం. ఉత్తమ బోధనతో పాటు అన్ని వసతులు కల్పిస్తున్నాం. ఇప్పటికే పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు చేరాయి. యూనిఫామ్ కుట్టడం వంటి ప్రక్రియ కూడా పూర్తి అయింది. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్‌లు పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ స్కూళ్లలో చేర్చాలని కోరుతున్నాం.

- కిషన్, మండల విద్యాశాఖ అధికారి, కూకట్‌పల్లి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

కూకట్‌పల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): దిల్‌కుష్‌నగర్‌లో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ హైదరాబాద్ ఐడీపీఎల్ జనరల్ మేనేజర్ వైఆర్‌కే రెడ్డికి బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఇప్పటికే ఎన్నో సమస్యలు పరిష్కరించుకున్నామన్నారు. దిల్‌కుష్‌నగర్‌లో మురుగునీటి సమస్య పరిష్కారం కోసం ఐడీపీఎల్ ఓపెన్ బౌండ్రీ ల్యాండ్ నుంచి పైప్‌లైన్ కలిపేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.



చెరువులో జరుగుతున్న పూడికతీత పనులు

వేగంగా సున్నం చెరువు అభివృద్ధి పనులు

అల్లాపూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సున్నం చెరువులో హైడ్రా ఆధ్వర్యంలో పూడికతీత పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఓ పక్క వానలు కాస్త ఇబ్బంది పెట్టినా పనులు వేగంగా సాగుతుండటంతో స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తారన్న వార్తలతో చుట్టుపక్కల కాలనీలవాసులు మరింత సంబరపడుతున్నారు. ఇరవై ఏళ్ల క్రితపు సున్నం చెరువును మళ్లీ చూడబోతున్నామంటూ స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడి మృతి

కూకట్‌పల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నర్సింహరాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన తిరుమలరాజు సామరాజు(40) ఈసీఐఎల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం పటాన్‌చెరువు వద్ద సికింద్రాబాద్ వైపు వెళ్తున్న బస్సు ఎక్కాడు. బస్సు బాలానగర్ శోభన టాకీస్ సమీపంలోకి వచ్చేసరికి సామరాజు కుప్పకూలి ఉండటం గమనించిన కండక్టర్ బస్సును రోడ్డు పక్కన నిలిపివేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న ఎస్‌హెచ్‌వో నర్సింహరాజు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులోకి జేఎన్‌టీయూ ఫ్రీ లెఫ్ట్

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే జేఎన్‌టీయూ చౌరస్తాలో మరో ఫ్రీ లెఫ్ట్ అందుబాటులోకి వచ్చింది. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని రద్దీ చౌరస్తాల్లో ఇది ప్రధానమైనది. కోవిడ్‌కు ముందే కూకట్‌పల్లి వైపు నుంచి కేపీహెచ్‌బీ మెయిన్ రోడ్డు మీదుగా జేఎన్‌టీయూ చౌరస్తా నుంచి హైటెక్ సిటీ వైపు వెళ్లేందుకు ఫ్రీ లెఫ్ట్ అందుబాటులోకి తెచ్చారు. తాజాగా హైటెక్ సిటీ వైపు నుంచి మియాపూర్ వైపు వెళ్లే వాహనదారుల కోసం జేఎన్‌టీయూ ప్రహరీని లోపలికి జరిపి కొత్తగా 30 అడుగుల మేర రోడ్డును ఫ్రీ లెఫ్ట్ కోసం అభివృద్ధి చేశారు. జీహెచ్‌ఎంసీ మూసాపేట్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు ప్రారంభం నుంచి పనుల్లో వేగం పెంచారు. దీంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించింది. శుక్రవారం నుంచి మియాపూర్ వైపు వెళ్తున్న వాహనదారులు సులభంగానే జాతీయరహదారి మీదకు చేరుకుంటున్నారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఫ్రీ లెఫ్ట్ వల్ల గతంలో నిరీక్షణ కోసం ఉండే 10-15 నిమిషాల సమయం కలిసి వస్తుందని వాహనదారులు చెబుతున్నారు. గతంలో ఇక్కడ ట్రాఫిక్ జామ్ అయితే రాజీవ్‌గాంధీ ఫ్లైఓవర్ మీద వాహనాలు నిలిచిపోయేవి. దీంతో ఒక్కోసారి 30-45 నిమిషాల సమయం పట్టేది. తాజాగా జేఎన్‌టీయూ ఫ్రీ లెఫ్ట్ అందుబాటులోకి రావడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జేఎన్‌టీయూ ఫ్రీ లెఫ్ట్‌లో వాహనాల రాకపోకలు



గణేష్‌ను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు

సైకిల్ యాత్రతో తిరుమలేశుడి దర్శనం

అల్లాపూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి జి.వి.గణేష్ కుమార్ యువతకు ఆదర్శంగా నిలిచారు. ఐదు రోజుల పాటు సైకిల్‌పై ప్రయాణించి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం శుక్రవారం ఇంటికి తిరిగొచ్చిన గణేష్‌ను గాయత్రి నగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన్ను కాలనీవాసులు అభినందించారు. కాగా, కస్టమ్స్ అండ్ జీఎస్టీ విభాగంలో పనిచేసిన ఆయన గతేడాది ఆగస్టులో రిటైరయ్యారు.

ఇంకుడు గుంతల ఏర్పాటుకు ముందుకొస్తున్న ప్రజలు

అల్లాపూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లో అనేక మంది ఇండిపెండెట్ ఇళ్ల యజమానులు, అపార్ట్‌మెంట్ వాసులు తమ నివాస సముదాయాల్లో ఇంకుడు గుంతలు తవ్వించుకుంటున్నారు. గతనెలలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఓ వినూత్న ప్రకటన చేశారు. ఎవరైతే ఇంకుడు గుంతను తవ్వించుకునే ఉద్దేశం ఉందో వారికి కాలనీ సంక్షేమ సంఘం తరఫున ప్రోత్సాహకంగా సగం ఖర్చును భరిస్తామని చేసిన ప్రకటనకు స్పందన లభిస్తోంది. ఇప్పటికే ఒకరిద్దరు ముందుకొచ్చి ఇంకుడు గుంతను తవ్వించారని, వారికి అభినందనలు తెలిపిన కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.కృష్ణారావు కాలనీలో మరి కొంత మంది నీటి పునరుజ్జీవం కోసం ప్రేరేపితులై వాటర్ హార్వెస్టింగ్ పిట్ ఏర్పాటుకు ముందుకొచ్చారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళితే వచ్చే ఏడాది వేసవిలో తమ కాలనీలో ఎవ్వరికీ నీటి ఎద్దడి ఉండదని, కేవలం 5 ట్యాంకర్ల ఖర్చుతో ఇంకుడు గుంత తవ్వించుకుని తద్వారా శాశ్వతంగా నీటి సమస్యను అధిగమించొచ్చని చెప్పారు.



ఓ అపార్ట్‌మెంట్ ముందు ఇంకుడుగుంత తవ్విస్తున్న కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణారావు

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోటా 19, వంకాయ 23, బెండకాయ 45, పచ్చి మిర్చి 35, బజ్జి మిర్చి 28, కాకరకాయ 45, బీరకాయ 45, క్యాబేజీ 15, బీన్స్ 115, క్యారెట్ 38, గోబి పువ్వు 23, దొండకాయ 23, చిక్కుడు కాయ 75, గోరు చిక్కుడు 40, బీట్‌రూట్ 21, క్యాప్సికం 60, అలుగడ్డ 24, కీర 23, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ 21, కంద 55, ఉల్లిపొరక 95, ఉల్లిగడ్డ 20, మామిడి కాయ 15-20, అరటికాయ 8-10, చామగడ్డ 35, ముల్లంగి 4-5, చిలగడ దుంప 30, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు 30-40, మునగ కాయలు 5-6, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండు మిర్చి 80, ఉసిరి 55, కరివేపాకు 70, పర్వల్ రూ.60, పల్లికాయ 55, లోబా 23, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు ఈ రోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.



యాగశాలలో హోమం జరిపిస్తున్న అర్చకులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

ఖేల్‌కాలనీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ ఎంఐజీకాలనీలోని రామాలయ ఆవరణలో గణపతి, సుబ్రమణ్య సహిత లింగాకార శివ, నాగదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు విగ్రహాలకు విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిగాయి. శుక్రవారం ప్రతిష్ఠాపన ప్రధాన ఘట్టాన్ని నిర్వహించారు. గణపతి పూజ, కలశారాధన, శిలాసంగ్రహణాది ప్రాయశ్చిత్త హోమం, గోదర్శనం, నవగ్రహారాధన, ప్రధాన హోమాలు జరిగాయి. ఉపాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా నూతనంగా నిర్మించిన పీఠంలో రత్నన్యాసం, హోమం జరిపించారు. అనంతరం ప్రతిష్ఠించిన విగ్రహాలకు విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు శంకుస్థాపన

ఖేల్‌కాలనీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎంఐజీకాలనీలోని రామాలయంలో 36 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి రూ.లక్ష 11వేలు, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్ లక్ష రూపాయల విరాళాన్ని విగ్రహ నిర్మాణం కోసం దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడి మృతి

కూకట్‌పల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నర్సింహరాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన తిరుమలరాజు సామరాజు(40) ఈసీఐఎల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం పటాన్‌చెరువు వద్ద సికింద్రాబాద్ వైపు వెళ్తున్న బస్సు ఎక్కాడు. బస్సు బాలానగర్ శోభన టాకీస్ సమీపంలోకి వచ్చేసరికి సామరాజు కుప్పకూలి ఉండటం గమనించిన కండక్టర్ బస్సును రోడ్డు పక్కన నిలిపివేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న ఎస్‌హెచ్‌వో నర్సింహరాజు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బక్రీద్ వేడుకలకు ముస్తాబైన మసీదులు

ఖేల్‌కాలనీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని మసీదులు సుందరంగా ముస్తాబయ్యాయి. శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, బీహెచ్‌ఈఎల్, ఎంఐజీకాలనీ, విద్యుత్‌నగర్ తదితర ప్రాంతాల్లోని మసీదుల్లో శనివారం నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. భెల్ టౌన్‌షిప్‌లో ఉన్న మసీదులో బక్రీద్ వేడుకల కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు బక్రీద్ పర్వదినం సందర్భంగా మసీదుల వద్ద ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని భారతీనగర్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి అధికారులకు సూచించారు. నిర్వాహకులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, రోడ్ల మరమ్మతులు తదితర అంశాలపై దృష్టి సారించాలని అధికారులను కోరారు.

జోరుగా గొర్రెల విక్రయాలు

బక్రీద్ పర్వదినం సందర్భంగా శివారు ప్రాంతాల్లో గొర్రెలు, మేకల విక్రయాలు జోరుగా సాగాయి. వందల సంఖ్యలో గుడారాలను ఏర్పాటు చేసి విక్రయాలను సాగించారు. రెండు రోజుల క్రితమే అమ్మకాలు ప్రారంభించగా, శుక్రవారం విక్రయాలు జోరందుకున్నాయి. పది వేల నుంచి అరవై వేల రూపాయల వరకు ధరలు ఉండగా.. గొర్రెల విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

త్యాగానికి ప్రతీక బక్రీద్..



ఈద్గా స్థలాన్ని శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



భెల్ టౌన్‌షిప్‌లోని మసీదు

హైదర్‌నగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగని ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఎల్లమ్మబండ పరిధిలోని గుడ్‌విల్ హోటల్ చౌరస్తాలోని ఈద్గాను ఆయన పరిశీలించారు. ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఈద్గా ఆవరణను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, షౌకత్‌అలీమున్నా, సమ్మద్, ఖాజా, రాజుగౌడ్ పాల్గొన్నారు.

అన్ని సమస్యలకూ త్వరలోనే పరిష్కారం

- జోనల్ కమిషనర్ హేమంత్

ఖేల్‌కాలనీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీకాలనీ, మ్యాక్‌సొసైటీ కాలనీ, ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియా తదితర ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ హేమంత్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఎల్‌ఐజీ ప్రధాన రహదారి నుంచి మ్యాక్ సొసైటీ కాలనీ అంబేడ్కర్ విగ్రహం వరకు నల్లా కనెక్షన్, డ్రైనేజీ నిర్మాణాలతో ధ్వంసమైన రోడ్లను తిరిగి నిర్మించాలని కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి ఆయన్ను కోరారు. పారిశుధ్య నిర్వహణపై బీహెచ్‌ఈఎల్ యాజమాన్యం అడ్డుపడుతోందని, ఇక్కడ పేరుకుపోతున్న చెత్తకుప్పలతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ఎంఐజీకాలనీ, బీడీఎల్ కాలనీల్లో ఓపెన్ జిమ్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయని చెప్పారు. జడ్సీ హేమంత్ స్పందిస్తూ అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ కమిషనర్ సురేష్, ఇంజనీరింగ్ విభాగం ఎస్‌ఈ శంకర్, పారిశుధ్య అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కాలనీల్లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ తదితరులు

మాదాపూర్ డివిజన్‌లో..

గచ్చిబౌలి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని జోనల్ కమిషనర్ హేమంత్ అన్నారు. శుక్రవారం ఉదయం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని కాకతీయ హిల్స్‌లో సీసీ రోడ్లు, ఆదిత్యనగర్, సుభాష్‌చంద్రబోస్ నగర్, ఇజ్జత్‌నగర్, భిక్షపతినగర్‌లలో శ్మశాన వాటికలు అస్తవ్యస్తంగా ఉన్నాయని స్థానికులు జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన జడ్సీ అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

మేకలను చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

మియాపూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మేకలను చోరీ చేసి సంతలో అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 32 మేకలను స్వాధీనం చేసుకున్నారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టాలిన్‌నగర్‌లో నివసించే వెంకటేష్ మేకలను సాదుకొని జీవిస్తున్నాడు. ఈ నెల 3న వెంకటేష్ మేకలను తన ఇంటిముందున్న షెడ్‌లో ఉంచాడు. 32 మేకలు చోరీకి గురికావడంతో వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అదే కాలనీకి చెందిన మహ్మద్ హతల్ హుస్సేన్‌పై అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

చందానగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లోని విశ్వేశ్వరస్వామి ఆలయ 10వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం కొనసాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన వేడుకల్లో భాగంగా త్రిశూల స్నానం, రుద్రహోమం, పంచసూక్త హోమం, పూర్ణాహుతి, బలిదానం, ఆశీర్వచనాలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు, ధ్వజారోహనం, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు చేపట్టారు. వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



కొండాపూర్ జిల్లా ఆస్పత్రి

కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో అందుబాటులోకి డయాలసిస్ సేవలు

గచ్చిబౌలి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కొండాపూర్ జిల్లా ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు ఆసుపత్రి సుపరింటెండెంట్ డాక్టర్ అనురాగిణిరెడ్డి తెలిపారు. దీంతో కొండాపూర్ పరిసర ప్రాంత ప్రజలకు ఖరీదైన వైద్య సేవలు పూర్తి ఉచితంగానే అందుతాయన్నారు. అయితే తెల్ల రేషన్ కార్డులు ఉన్నవారికే ఈ సేవలు అందుతాయని ఆమె వెల్లడించారు. డయాలసిస్ సేవలు అవసరమైన వారు రేషన్ కార్డుతో ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీ విభాగంలో సంప్రదించాలని సూచించారు.

సిబ్బందిని నియమించాలి

పేదలకు ఉచితంగా డయాలసిస్ సేవలు అందించడం హర్షనీయమని మాజీ కౌన్సిలర్ తాడిబోయిన రామస్వామియాదవ్ అన్నారు. అయితే కేంద్రంలో సేవలందించాల్సిన సాంకేతిక నిపుణులను నియమించకపోవడం విచారకరమన్నారు. ఈ మేరకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

చందానగర్, జూన్6(ఆంధ్రజ్యోతి): డిఫెన్స్ మద్యం అమ్ముతున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద ఉన్న వివిధ బ్రాండ్లకు చెందిన 160 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మియాపూర్ మాతృశ్రీనగర్‌లో శుక్రవారం జరిగింది. రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మాతృశ్రీనగర్‌కు చెందిన మన్నవ గాంధీ(65) కొన్ని రోజుల నుంచి డిఫెన్స్ మద్యం అమ్ముతున్నాడు. మాతృశ్రీనగర్‌లోని ఓ రేకుల షెడ్‌లో మద్యాన్ని నిల్వ ఉంచి అక్కడి నుంచి సరఫరా చేసేవాడు. ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందడంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

29న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

ఖేల్‌కాలనీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అఖిల బ్రాహ్మణ సమాజాభివృద్ధి సంస్థ బీహెచ్‌ఈఎల్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఆదివారం బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామని భెల్ శాఖ అధ్యక్షుడు ఎంవీ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి జీవీఎస్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని సంక్షేమ భవనంలో కార్యవర్గ సమావేశం, అనంతరం వివాహ వేదిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు 9490167878, 9440360089 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

అర్జీదారులతో సౌమ్యంగా వ్యవహరించాలి

దుండిగల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ జిల్లా పరిధిలోని రైతు సదస్సులో వచ్చిన దరఖాస్తులను రైతులు ఇచ్చిన డాక్యుమెంట్లను జత చేసి వారికి సలహాలు, సూచనలు అందించా లని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో అర్జీదారులతో సౌమ్యంగా వ్యవహరిస్తూ వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఈ సమావేశంలో గండిమైసమ్మ, దుండిగల్ , మల్లంపేట గ్రామంలో నిర్వహిస్తున్న భూభారతి సదస్సును మల్కాజిగిరి ఆర్‌డీఓ శ్యామ్ ప్రకాష్‌తో కలిసి అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం చెయ్యకుండా వెంటనే పరిష్కరించి, రైతులకు ప్రభుత్వంపై భరోసా కల్పించాలన్నారు. సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు అందులో పేర్కొన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. రైతులు సమర్పించిన ప్రతి దరఖాస్తుకు రశీదు ఇవ్వాలని ఆదేశించారు. మల్లంపేటలో జరిగిన సదస్సులో కొందరు రైతులు సర్వే నెంబ రు 170లో తాము వ్యవసాయం చేస్తున్నామని, పాస్ బుక్‌లు ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ మతిన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

చెట్ల పొదల్లో యువకుడి మృతదేహం

● సహజ మరణమా, హత్యా?

పేట్‌బషీరాబాద్,జూన్6(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఓ యువకుడి శవాన్ని పేట్‌బషీరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వయస్సు దాదాపు 20 నుంచి 30 సంవత్సరాలు ఉంటుంది. పోలీసుల కథనం ప్రకారం... పేట్‌బషీరాబాద్‌లోని మధుర టిఫిన్ సెంటర్ ఎదురుగా గల రోడ్డు డివైడర్ మధ్యలో గల చెట్ల పొదల్లో కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం సాయంత్రం గుర్తించారు. ఈ విషయాన్ని పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఒంటిపై నీలిరంగు టీషర్ట్, దానిపై అగర్వాల్ వాటర్ ట్యాంక్ కంపెనీ పేరు ఉంది. బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఇతని మృతిపై స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఎవరైనా హత్యచేసి ఇక్కడ పడేసి ఉంటారా, లేక సహజ మరణమా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం రంగంలోకి దిగి పరిశీలించాయి. మృతుని ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూల్చి వేయడం కాదు... జైలుకు పంపాలి : సీపీఐ

దుండిగల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారంలోని సర్వే నంబరు 326, 307ల్లో కొంత కాలంగా కబ్జాలు చేసి నిర్మాణాలు చేపడుతున్నారని, ఆక్రమిస్తున్న కబ్జాదారులపై కేసులు నమోదు చేసి, జైలుకు పంపాలని సీపీఐ మండల నాయకులు కోరారు. ఈ మేరకు వారు కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ, కూల్చి వేయడం, మళ్లీ నిర్మాణాలు చేపడుతున్నారని, 1,2 కూల్చి వేసి అధికారులు చేతులు దులుపుకోవడమే తప్ప ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాలను పూర్తిగా కూల్చి వేయకుంటే ఆ స్థలాల్లో గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శ ఉమామహేష్, స్వామి, హరినాథ్‌రావు, నర్సింహారెడ్డి, రవి, సుంకిరెడ్డి, శ్యామ్యూల్, కార్తీక్‌లు ఉన్నారు.

పార్కులతో మానసిక ప్రశాంతత

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

పేట్‌బషీరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మానసిక ఆనందం, ప్రశాంతతకు పార్కులు ఎంతగానో దోహదం చేస్తాయని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని మహానగర్ ఎస్టేట్‌లో రూ.32.20 లక్షలతో నూతనంగా నిర్మించిన ఓపెన్ జిమ్, పార్కుతో పాటు సీసీరోడ్డును ఆయన కార్పొరేటర్ తారా చంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్‌లోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు కమ్యూనిటీహాళ్లు నిర్మించామని, పార్కులను అభివృద్ధి చేశామని అన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

అలాగే రుక్మిణి ఎస్టేట్‌లో రూ.41.50 లక్షల చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ తారా చంద్రారెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో రుక్మిణి ఎస్టేట్ అధ్యక్షుడు శేఖర్, కాలనీ వాసులు నర్సింహారెడ్డి, శంకర్‌రెడ్డి, మహానగర్ అధ్యక్షుడు ఎస్ కుమార్, ఉపాధ్యక్షులు రవీందర్, సురేష్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, కోశాధికారి ధర్మయ్య, బీజేపీ మేడ్చల్ జిల్లా అర్బన్ కార్యదర్శి భరత్ సింహారెడ్డి, డివిజన్ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన

షాపూర్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సూరారం గ్రామం అయ్యప్ప కాలనీలో నూతనంగా నిర్మించిన బంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారికి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సత్యనారాయణ, హేమలతా సురేష్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, గుడి సభ్యులు, జంగారెడ్డి, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

విజయవంతంగా 'ఒక మార్పు- అభివృద్ధికి మలుపు'

దుండిగల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): 'ఒక మార్పు- అభివృద్ధికి మలుపు' అనే నినాదంతో చేపట్టిన 100 రోజుల కార్యక్రమం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి వి. సాయినాథ్ శుక్రవారం జరిగిన కార్యక్రమంలో దొమ్మరపోచంపల్లిలోని బస్తీ దవాఖానా వద్ద మున్సిపల్ శానిటేషన్ కార్మికుల కోసం వైద్య శిబిరం నిర్వహించారు. పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులకు ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని, మున్సిపాలిటీలో అన్ని ప్రాంతాల్లో కార్మికులకు బస్తీ దవాఖానాలో ఆరోగ్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిలోని చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి మీ ఇంటి ముందుకు వచ్చే స్వచ్ఛ ఆటో కార్మికులకు అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని, అలా వేసిన వారిపై జరిమానా విధిస్తామన్నారు.

మున్సిపల్ ఆటోలు నుంచి వచ్చిన చెత్తను డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న డీఆర్‌సీసీ సెంటర్‌లో తడి, పొడి చెత్తగా వేరు చేసి కంపోస్ట్ చేస్తామన్నారు. అదే విధంగా పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపిస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అందరూ మొక్కలు నాటాలని సూచించారు. పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. వెంకటేశ్వర్‌నాయక్, మున్సిపల్ ఇంజ నీర్ సుందర్‌నాయక్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ సాత్విక్, వార్డు ఆఫీసర్లు, మెప్మా మహిళా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.


ప్రజలకు సూచనలు ఇస్తున్న శానిటేషన్ అధికారులు

నిజాంపేట్ కార్పొరేషన్‌లో..

నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో శుక్రవారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది 'ఒక మార్పు.. అభివృద్ధికి మలుపు అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణ, తడి, పొడి చెత్తను వేర్వేరు చేయడం వంటి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు విస్తృతంగా మొక్కలను నాటడం, ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో స్వయం సహాయక బృందాలు ఎస్‌హెచ్‌జీ సభ్యులు , మున్సిపల్ సిబ్బంది, పలు డివిజన్‌ల ప్రజలు ఉన్నారు. నిజాంపేట నగర పాలితసంస్థను ఒక శుభ్రమైన, ఒక హరిత అభివృద్ధి వైపు నడిపించే దిశగా మున్సిపల్ అధికారులు ప్రజల సహకారం కోరారు.


భవనాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్

త్వరలోనే అందుబాటులోకి మహిళా భవనం

పేట్‌బషీరాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డినగర్ డివిజన్ వెంకట్రామ్‌రెడ్డినగర్‌లో నిర్మించిన మహిళా భవనం త్వరలోనే అందుబాటులోకి రానున్నదని కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్ తెలిపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నిధులతో నిర్మించిన ఈ మహిళా భవనాన్ని కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ, మహిళా పొదుపు సంఘాల కోసం ఈ భవనాన్ని ప్రత్యేకంగా నిర్మించారని, త్వరలోనే అందుబాటులోకి రానున్నదని తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు సతీష్, మొహ్మద్ రశీద్, కార్తీక్‌గౌడ్, సంతోష్‌గౌడ్, తేజా యాదవ్, సోమరాజు పాల్గొన్నారు.

తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

పేట్‌బషీరాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని దుకాణదారులు, వ్యాపార సంస్థల యజమానులు తప్పని సరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని కమిషనర్ ఎన్.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేకు వచ్చే వార్డు అధికారులకు అవసరమైన పత్రాలను సమర్పించి, వ్యాపారస్తులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.

నేటి నుంచి 'బడిబాట'

పేట్‌బషీరాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు ఈనెల 12 నుంచి పున: ప్రారంభం కానున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా బడిబాట కార్యక్రమాన్ని నేటి (శనివారం) నేటి నుంచి ప్రారంభించనున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి, గండి మైసమ్మ, దుండిగల్, కుత్బుల్లాపూర్ మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాలలు 85, ఒక ప్రాథమికోన్నత, 21 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గతేడాది 24 వేల 350 మంది విద్యార్థులు చదువుకోగా, ఈ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు నేటి నుంచి 15 రోజుల పాటు బడిబాట కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బస్తీలు, బడుగు, బలహీన వర్గాలు నివసించే ప్రాంతాలను ఎంపిక చేసుకొని ఉపాధ్యాయులు అవగాహన కార్య క్రమాలు చేస్తారు. శుక్రవారం సూరారంలో, గిరినగర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీని నిర్వహించి, వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. వివరించాలి. 19తో బడిబాట కార్యక్రమం ముగుస్తుంది. 7వ తేదీ ప్రతీ ఇంటిని సందర్శించి బడిఈడు పిల్లలను గుర్తించాలి. 8 నుంచి 10 వరకు కరపత్రాలు ఇంటింటా ప్రచారం, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన , ఈనెల 11న నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష చేపట్టాలి. 12న అమ్మఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలి. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించాలి. 13న సామూహిక అక్షరాభ్యాసం, 16న ఎఫ్ఎల్ఎన్ అండ్ ఎల్ఐపీ దినోత్సవం చేపట్టాలి. 17న బాలిక విద్యా దినోత్సవం నిర్వహించాలి. 18న తరగతి గదుల్లో డిజిటల్‌పై అవగాహన, మొక్కల పెంపకం, విద్యార్థులకు వివరించాలి. 19తో బడిబాట కార్యక్రమం ముగుస్తుంది.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు